## క్లుప్తంగా

### ఈరన్నస్వామికి అభిషేక పూజలు


విశేష అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజల అనంతరం ఫలపుష్పాలతో అలంకరించారు. కొందరు భక్తులు తమ మొక్కును తీర్చుకునేందుకు దేవాలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యంగా సమర్పించారు.

### పది విద్యార్థులకు రివిజన్ టెస్ట్‌లు


కోసిగిలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కోసిగి: ప్రభుత్వ ఆదేశాల మేరకు 10వ తరగతి విద్యార్థులకు రివిజన్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు వంద రోజుల ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. అందులో భాగంగా సిలబస్ ఆధారంగా రివిజన్ టెస్ట్‌లు నిర్వహించి అందులో సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులకు సిలబస్ రివిజన్ చేయిస్తున్నామని పేర్కొన్నారు.

### నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కౌతాళం: మండలంలోని ఎరిగేరి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సుబ్బారాజు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యక్రమంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి పాల్గొంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

### సమస్యలను పరిష్కరించాలి

కోసిగి: అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ సభ్యులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో కార్యకర్తలు కొనసాగిస్తున్న సమ్మెకు ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మద్దతు ప్రకటించారు. ఉపాధ్యాయులు ఖలీల్ అహ్మద్, రాజామౌళి, నారాయణ, నరసయ్య. సంజన్న, వెంకటరెడ్డి, గురుస్వామి, శోభరాణి, ఓబులేష్ పాల్గొన్నారు.

### సన్మార్గంలో నడవాలి


పెద్దకడబూరు చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ నాయకులు

పెద్దకడబూరు : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని సీఎస్‌ఐ చర్చి పాస్టర్ ముత్తు మనోహర్‌బాబు కోరారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా స్థానిక సీఎస్‌ఐ చర్చిలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉప సర్పంచ్ విజయేంద్రరెడ్డి, నాయకుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

### పల్లకీలో ఊరేగిన రంగనాథుడు

మద్దికెర: పెరవలి గ్రామంలోని రంగనాథ స్వామి దేవాలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా సోమవారం స్వామి వారిని సతీసమేతంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ముందుగా మూలవిరాట్ రంగనాథస్వామి, శ్రీదేవి, భూదేవిలకు ఉదయం బిందె సేవ, అభిషేకం, అష్టోత్తరనామార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయంలో ప్రదక్షిణ కార్యక్రమాలు చేశారు. దేవాలయ కమిటీ చైర్మన్ దస్తగిరిగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### యువకుడిపై దాడి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని శ్రీనివాస సర్కిల్ వద్ద ఆదివారం రాత్రి మహబూబ్ అనే యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఎన్టీఆర్ కాలనీకి చెందిన మహబూబ్ ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా శ్రీనివాస సర్కిల్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన మహబూబ్‌ను అటుగా వెళ్లిన వారు గమనించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు సోమవారం సాయంత్రం తెలిపారు.

# అంబరాన్నంటిన నూతన సంబరాలు

- ఘనంగా నూతన సంవత్సర వేడుకలు
- కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్న యువత
- నాయకులు, ఉన్నతాధికారులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- కిటకిటలాడిన ఎమ్మెల్యే నివాసం, ప్రభుత్వ కార్యాలయాలు


ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు


ఎమ్మెల్యేను సత్కరించిన వ్యాపారవేత్తలు, వైఎస్సార్‌సీపీ నాయకులు


ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌ను సన్మానించిన విరుపాపురం నాయకులు


డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్న పోలీసులు

ఆదోనిటౌన్: పట్టణంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం రాత్రి నుంచే అంబరాన్నంటాయి. సోమవారం ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకుని సంబరాలు చేసుకున్నారు. పలుచోట్ల కేక్‌లు కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. ఇక వివిధ పార్టీల నాయకులను కార్యకర్తలు, అభిమానులు, అధికారులను కింది స్థాయి సిబ్బంది కలిసి పూల బొకేలు, పూలమాలలు, స్వీట్లు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఆయా కార్యాలయాలు సందడిగా మారాయి. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని నియోజకవర్గంలోని పార్టీ కార్యకర్తలు, నాయకులు, వ్యాపారవేత్తలు, రైతులు, అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్‌లు, పోలీసు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ ఉద్యోగులు, మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, అర్బన్‌హెల్త్ సెంటర్‌ల డాక్టర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కన్వీనర్లు, గృహసారథులు ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదోనిరూరల్: పట్టణంలోని మండిగిరి గ్రామంలోని బీసీ హాస్టల్‌లో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ పోస్టు మెట్రిక్ విద్యార్థులతో కలిసి సోమవారం నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ముందుగా సబ్‌కలెక్టర్ విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వారికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని వాటికోసం సాధన చేస్తే గమ్యం చేరుకోవడం సులభమవుతుందని చెప్పారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చెప్పారు. వసతిగృహంలో నున్న గదుల్లోని ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్స్, టాయిలెట్స్, వంటగది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఏదైనా సమస్యలు వస్తే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సబ్‌కలెక్టర్‌కు అధికారులు, వివిధ పార్టీల నాయకులు శుభాకాంక్షలు తెలియజేసేందుకు తెచ్చిన కేకులు, పండ్లు, మిఠాయిలను విద్యార్థులకు అందజేశారు.

కోసిగి: మండలంలో నూతన సంవత్సర వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. అర్ధరాత్రి నుంచి కొత్త సంవత్సం 2024లో అడుగు పెడుతున్న సందర్భంగా చిన్నారులు, యువకులు వాడ వాడల్లో కేక్‌లు కట్ చేసి బాణా సంచా పేల్చి ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈరన్నను ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అభినందనలు తెలిపారు. ఉరుకుంద ఈరన్న ట్రస్ట్ బోర్డు కమిటీ సభ్యులు బుళ్లి నరసింహులు, ఏఓ మాధవరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శిరాజ్ అహ్మద్, గంగాభవాని, సుధాకర్, పంచాయతీ కార్యదర్శి రామరాజు పాల్గొన్నారు.

మంత్రాలయం: నూతన సంవత్సరంలో నియోజవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆనందంగా ఉండాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం ప్రజలకు నూతన సంవత్సర శుభకాంక్షలు తెలిపారు. రాంపురం గ్రామంలో ఎమ్మెల్యేను వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభకాంక్షలు తెలిపారు. అలాగే మండలం కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నూతన సంవత్సర సంబరాలు అంబరాన్నంటాయి. యువకులు, చిన్నారులు, పెద్దలు ఒకరినొకరు శుభకాంక్షలు తెలిపుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వేడుకల్లో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల నాయకులు

పెద్దకడబూరు : మండలంలోని గ్రామాలలో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఎంపీడీఓ ప్రభాకర్, సిబ్బంది, వివిధ మండల స్థాయి అధికారులు సింగిల్‌విండో అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు హనుమంతరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, ఎంపీపీ శ్రీవిద్య, మండల అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ రాజేశ్వరిని వారివారి స్వగృహాల్లో కలిసి శుభకాంక్షలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో మరోసారి అత్యధిక మెజార్టీతో పార్టీని గెలిపించుకొని ఇలాగే సంతోషంగా ఉందామని నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఆదోనిఅర్బన్: స్థానిక డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నూతన సంవత్సర వేడుకలను పోలీసులు ఘనంగా నిర్వహించుకున్నారు. డీఎస్పీ శివనారాయణస్వామి దంపతులు కేక్ కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఆటుపోట్లను, ఒత్తిడిని ఎదురించి ముందుకు సాగాలని సూచించారు. సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## తాగునీటిని పంటలకు మళ్లిస్తే చర్యలు


ఎల్లెల్సీపై అక్రమ నీటి మళ్లింపునకు ఉపయోగిస్తున్న పైపులను స్వాధీనం చేసుకున్న డీఈ

ఎమ్మిగనూరుటౌన్: తాగునీటి అవసరాల కోసం ఎల్లెల్సీలో నిల్వ ఉంచిన నీటిని పంటలకు మళ్లించేందుకు పైపులు వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ డీఈ మనోహర్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం రాత్రి ఎల్లెల్సీ, గుడికల్ చెరువు, ఎస్‌ఎస్ ట్యాంకులపై పెట్రోలింగ్ చేస్తుండగా కాలువలో నిల్వ చేసిన నీటిని గుడికల్‌కు చెందిన కొందరు రైతులు పైపుల ద్వారా పంటలకు మళ్లిస్తుండడాన్ని గమనించి మున్సిపల్ సిబ్బంది పైపులను స్వాధీనం చేసుకున్నారు. వేసవిలో పట్టణంలో మంచినీటి ఎద్దడి నివారించేందుకు ప్రస్తుతం ఎల్లెల్సీలో వచ్చిన నీటిని నిలువ ఉంచుకోవడం జరిగిందని ఆ నీటిని పంటలకు మళ్లిస్తే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని డీఈ హెచ్చరించారు. కాలువలో ప్రస్తుతం వచ్చిన నీటిని మొదటి ప్రాధాన్యతగా తాగునీటి అవసరాలకు మాత్రమే ఉపయోగిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది ఉన్నారు.

## పంట మార్పిడితో అధిక దిగుబడి

కౌతాళం: రైతులు పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి శేషాద్రి తెలిపారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా సోమవారం ఉదయం మండల కేంద్రంలో కార్యదర్శి చెన్నయ్య అధ్యక్షతన, సాయంత్రం కామవరం గ్రామంలో సర్పంచ్ వసంత అధ్యక్షతన కార్యక్రమం చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అనంతరం డ్రోన్ల ద్వారా పంటలపై మందులను పిచికారీ చేసే విధానాన్ని పొలాలకు వెళ్లి రైతులకు ప్రత్యక్షంగా చూయించారు. నాయకుడు సుబ్బారాజు, ఏపీఓ జుబేర్‌అహ్మద్, ఏపీఎం రాజశేఖర్, వీఆర్‌ఓ, వలంటీర్లు, బీజేపీ నాయకులు చిన్న ఈరన్న, పెద్ద ఈరన్న పాల్గొన్నారు.


డ్రోన్ ద్వారా మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## 'ముద్ద మందారాలు' పుస్తకావిష్కరణ


పుస్తకావిష్కరణ గావిస్తున్న దృశ్యం

పెద్దకడబూరు : మండలంలోని కంబదహాల్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త గద్వాల సోమన్న రచించిన 46వ కొత్త పుస్తకం 'ముద్ద మందారాలు' బాలగేయాల సంపుటి సోమవారం అవిష్కరించారు. నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకొని సోమాజిగూడ హైదరాబాద్‌లో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, ఏఎల్ కృష్ణారెడ్డి, ప్రముఖ సాహిత్యవేత్త డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, కళారత్న డాక్టర్ విడి రాజగోపాల్ చేతుల మీదుగా పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా గద్వాల సోమన్న మాట్లాడుతూ ఈ పుస్తకాన్ని కళాపోషకులు, విశ్రాంత ఫారెస్టు ఆఫీసర్ ఏఎల్ కృష్ణారెడ్డి గారికి అంకితమిచ్చినట్లు చెప్పారు. వోలేటి పార్వతీశం, యాంకర్ స్వప్న, డాక్టర్ మహమ్మద్ రఫీ, బిక్కి కృష్ణ, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి పాల్గొన్నారు.

## డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆదోని సెంట్రల్: పట్టణంలో పురపాలక ఉన్నత పాఠశాల అవరణలో ఎస్టీయూ డైరీ,క్యాలెండర్లను డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి, ఎంఈఓలు బి.శివరాములు, శ్రీనివాసులు సోమవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ భవనంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కౌన్సిలర్లు మహదేవప్ప, వీరచంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న నాయకులు గోపాల్, బి. రామాంజనేయులు, కె.ప్రహ్లాద్, వెంకోబ, ప్రసాద్ పాల్గొన్నారు.


డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

## రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి సోమవారం భక్తులు విరాళం అందజేశారని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వాణి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్ తెలిపారు. బళ్లారికి చెందిన శకుంతలబాచి, ఈరోజీరావు అండ్ సన్స్ రూ.1,00,116, పుష్పలత, అశోక్‌కుమార్ అండ్ సన్స్ రూ.1,00,116 ఆలయ కార్యాలయంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి ప్రసాదం, శేష వస్త్రాలు, బాండు, ఫొటో అందజేశారు.


దాతకు బాండ్ అందజేస్తున్న దృశ్యం

## చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలో పాల్గొన్న ప్రజలు

ఆదోని సెంట్రల్: పట్టణంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అయా చర్చిల్లో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆదోని-అస్పరి రహదారిలో ఉన్న ఆర్‌సీఎం చర్చిలో క్రైస్తవులు ప్రార్థనలో పాల్గొన్నారు. ఫాదర్ రెవరెండ్ గురెడ్డి విన్నారెడ్డి మాట్లాడుతూ మన చెడు అలవాట్లు, చెడు సహవాసం వంటి వాటికి దూరంగా ఉండి కొత్త జీవితాన్ని ప్రారంభించాలని సూచించారు. ఎస్‌కేడీ కాలనీ, విక్టోరియా పేటలో సీఎస్‌ఐ చర్చిలలో పాస్టర్ భాస్కర్ బాబు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పెంతకోస్తు, సియోను మందిరం,ఇండిపెండెంట్ చర్చిల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఫాదర్లు బల్ల రొట్టె, ద్రాక్షరసం అందజేశారు.